క్లుప్తంగా

నేడు పెండ్లిమర్రికి ఎమ్మెల్యే రాక

పెండ్లిమర్రి : తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 9 గంటలకు చుక్కల భూముల చిక్కులకు శాశ్వత పరిష్కార కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి రానున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాచునూరు చంద్రారెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజులు తెలిపారు. మండలంలో 2314 మంది రైతులకు సంబంధించి 3841 ఎకరాలు చుక్కల భూమిని 22ఏ నిషేధిత జాబితానుంచి తొలగిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన లేఖలను లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు హాజరుకావాలని వారు కోరారు.

జగనన్న పాలవెల్లువపై సమీక్ష సమావేశం

పెండ్లిమర్రి : జగనన్న పాల వెల్లువపై స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో బుధవారం అధికారులకు ఎంపీడీవో అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని నందిమండలం, కొండూరు, గొందివల్లె, చీమలపెంట గ్రామాల్లో పాల సెంటర్ల ఏర్పాటు చేయాలన్నారు. వాటికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, రూట్ ఇన్‌చార్జిలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించండి

జమ్మలమడుగు : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ హిమజాదేవికి డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ బుధవారం వినతిపత్రం అందేశారు. ఆసుపత్రిలో జనరేటర్ నిరుపయోగంగా ఉందని, అలాగే ఆసుపత్రిలో రేడియాలజిస్టు లేకపోవడం వల్ల స్కానింగ్‌ల కోసం బయటకు వెళ్లాల్సి వస్తోందని, అలాగే ఆర్థోపెడిక్ డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

పొగాకుతో క్యాన్సర్ వచ్చే అవకాశం



కమలాపురం పెద్ద దర్గా వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కమలాపురం : పొగాకు నమలడం, ధూమపానం చేయడం వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్ కుమార్, అయ్యవారు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీ



చెక్కులతో పాడి రైతులు

చెన్నూరు : పాడి రైతులను ఆదుకునేందుకు విజయ మిల్క్ డైరీ ముందుకు వస్తోంది. మండలంలోని రామనపల్లి గ్రామంలో విజయ డైరీ మిల్క్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా కొత్తగా పశువులను కొనుగోలు చేసి డైరీకి పాలు పోస్తున్నారో అలాంటి వారికి పశువు కొనుగోలుపై 20 శాతం రాయితీని అందించేందుకు విజయ డైరీ మిల్క్ సిద్ధంగా ఉన్నట్లు విజయ డైరీ మిల్క్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. రామనపల్లె గ్రామానికి సంబంధించి రూ. లక్ష 18 వేలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. విజయ మిల్క్ డైరీ మేనేజర్ రామనపల్లె గ్రామానికి విచ్చేసి గ్రామంలోని విజయ డైరీ ఏజెంట్ సునీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పదిమంది రైతులకు పది చెక్కులను అందించారు. రైతులు మేనేజర్ వెంకట్రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగాశిక్షణ శిబిరం

కడప కల్చరల్ : కడప నగరం పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల యోగా శిక్షణా శిబిరాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నామని సంస్థ నిర్వాహకులు, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన తెలిపారు. ఉదయం 5.30 నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 9.00 నుంచి 10.30 గంటల వరకు మహిళలకు ప్రత్యేక బ్యాచ్‌గా శిక్షణ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 98488 61206 లేదా 70132 38986 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పిరమిడ్ యోగా కేంద్రంలో

స్థానిక విశ్వాత్మ పిరమిడ్ యోగా కేంద్రంలో జూన్ 5వ తేదీ నుంచి యోగ, ధ్యాన శిక్షణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఊర్మిళాదేవి, ప్రొఫెసర్ జీవీఎస్ రెడ్డిలు తెలిపారు. నగరంలోని బుద్ధటౌన్‌షిప్‌లో ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకుశిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 80748 26819 నంబరులో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ సంబరాల్లో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేసి దేశం చూపు అంతా ఏపీ వైపు మరల్చిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి తెలిపారు. మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంబరాల్లో భాగంగా బుధవారం 4వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి గ్రామచావడి వరకు అలాగే అక్కడి నుంచి క్రాస్ రోడ్డు వరకు, తిరిగి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అవినీతిలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుపుతున్నారన్నారు. అధికారంలోకి రాగానే నవరత్నాలను ఒక భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి సంక్షేమ క్యాలెండర్ ప్రకటించారన్నారు. ప్రకటించిన తేదీ కంటే ఒక రోజు ముందే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ వైఎస్ జగన్‌ను మరో సారి ఆశీర్వదించాలన్నారు. ప్రతి కుటుంబం వైఎస్ జగన్‌ను తమ కుటుంబ సభ్యుడిగా భావించడం వల్లనే 151 సీట్లతో సీఎం అయ్యారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్‌పీఎస్ ఆర్, మహ్మద్ సాదిక్, కొండారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, ఇర్ఫాన్, పి.సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, మస్తానయ్య, ఖాజా హుసేన్, గౌస్ మొహిద్దీన్, విజయేంద్రారెడ్డి, సుబ్బన్న, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవ మూర్తులు

వేముల : మండలంలోని చాగలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, మహా పూర్ణాహుతి, కుంభ యాత్ర దానం, కళావాహన హారతి నిర్వహించారు. అనంతరం సీతారామ,లక్ష్మణ, హనుమాన్‌విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురోహితులు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సీతారాముల ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు. నెల్లూరు వారిచే ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన, బ్రహ్మంగారి జీవిత చరిత్ర పౌరాణిక నాటికను ప్రదర్శించారు.

ఘనంగా బండలాగుడు పోటీలు

శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని బండలాగుడు పోటీలను నిర్వహించారు. పెర్నపాడుకు చెందిన రామాంజనేయులు ఎద్దులు ప్రథమ స్థానం రూ.35వేలు, ముదిగుబ్బకు చెందిన కోట్ల రమణ ఎద్దులు రెండవ స్థానం రూ.30వేలు, వేంపల్లెకు చెందిన వి.రమణయ్య ఎద్దులు మూడవ స్థానం రూ.25వేలు, బ్రాహ్మణపల్లెకు చెందిన చిన్న పుల్లారెడ్డి ఎద్దులు నాల్గవ స్థానం రూ.20వేలు, కడేకళ్లు గ్రామానికి చెందిన భీమశేఖరయాదవ్ ఎద్దులు 5వ స్థానం రూ.15వేలు, చెర్లోపల్లెకు చెందిన గోవర్ధన్‌రెడ్డిలు ఎద్దులు 6వ స్థానం రూ.10వేలు, సిద్ధలాపురంకు చెందిన కోలన్న ఎద్దులు 7వ స్థానం రూ.5వేల నగదు బహుమతులను మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డిలు అందించారు.

న్యాయమే గెలిచింది

వేముల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిరాధారమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు రావడంతో న్యాయమే గెలిచిందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డిలు అన్నారు. మండలంలోని చాగలేరు గ్రామంలో బుధవారం వారు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొంతకాలంగా ఎల్లో మీడియా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై బురదజల్లే కార్యక్రమం చేపట్టిందన్నారు. బెయిల్ మంజూరు చేయడంతో న్యాయమే గెలిచిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా వెంకటనారాయణ, సొసైటీ అధ్యక్షుడు పేరం గంగిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మల్‌రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి గేదె మృతి



మృతి చెందిన గేదె

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలం వద్దిరాలకు చెందిన కొర్నేపల్లె సుబ్రమణ్యంకు చెందిన పశువులు మంగళవారం మేత మేసేందుకు కొండకువెళ్లాయి. సాయంత్రానికి పశువులు అన్ని ఇంటికి చేరుకోగా ఒక్కటి మాత్రం రాలేదు. బుధవారం సుబ్రమణ్యం కుటుంబసభ్యులు గేదెకోసం వెళ్లగా గ్రామానికి చెందిన రాముడు పొలంవద్ద విద్యుత్ తీగ తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. దాదాపు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

నేడు ఉర్దూ కవి సమ్మేళనం

కడప కల్చరల్ : ప్రముఖ ఉర్దూ కవి యూసఫ్ సఫీ జయంతిని పురస్కరించుకుని గురువారం కడప నగరంలో ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కార్యక్రమ కన్వీనర్ సత్తార్ ఫైజి తెలిపారు. బజ్మె జకి సంస్థ ఆధ్వర్యంలో నబీ కోటలోని మదరసా-యే-ఫైజానె మహబూబె సుబానీలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.విక్రాంత ఆచార్యులు డాక్టర్ సత్తార్ సాహిర్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని, ప్రొఫెసర్ ఖాసిం అలీఖాన్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉర్దూ కథకులు మహమ్మద్ షాహీద్, డాక్టర్ ఇక్బాల్ ఖుస్రో, మహబూబ్‌ఖాన్, డాక్టర్ వసీవుల్లా బక్తియార్ కూడా పాల్గొంటారన్నారు. స్థానికంగా గల పలువురు ఉర్దూ కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, కళా కారులు, సాహిత్యాభిమానులు కార్యక్రమానికి హాజరవుతారని ఆయన తెలిపారు.

ప్రతి రైతుకు విత్తనాన్ని అందిస్తాం



వేరుశనగ విత్తనాన్ని అందజేస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : వేరుశనగ పంట సాగు చేసే ప్రతి రైతుకు విత్తనాన్ని అందిస్తామని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. మండలంలోని మొయిళ్లచెరువు రైతు భరోసా కేంద్రంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో రైతులపట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వారికి అవసరమైన అన్నింటిని అందిస్తోందన్నారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ మొయిళ్లచెరువు రైతుభరోసా కేంద్రానికి ఇప్పటి వరకు 40 క్వింటాళ్ల మంజూరయ్యాయని వాటిని రైతులకు అందజేశామన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ 40 శాతం రాయితీతో విత్తనాన్ని అందిస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుభరోసా సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని బాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరి చేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రైతుకు హుందాను పెంచే ఒంగోలు జాతి ఎద్దులు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : రైతులకు హుందా తనాన్ని పెంచేవి ఒంగోలు జాతి ఎద్దులు అని ఆస్థానయే గౌసియా పీఠాధిపతి, ప్రభుత్వ గెజిటెడ్ ఖాజీ సయ్యద్‌షా గౌస్ పీరాఖాద్రీ అన్నారు. వలగాడికి చెందిన హజరత్ సయ్యద్‌షా బడే గౌస్‌పీరా ఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవం పురస్కరించుకుని పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో న్యూ కెటగిరి ఒంగోలు జాతి బండ లాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలలో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన ఎద్దులు మొదటి స్థానం రూ.50వేలు, అనంతపురం జిల్లా సింగనమల్ల మండలం చక్రయపేటకు చెందిన ఎద్దులు రెండవ స్థానం రూ. 45, మైలవరం మండలం చిన్నకొమెర్ల గ్రామానికి చెందిన ఎద్దులు మూడో స్థానం రూ.40వేల నగదు బహుమతులను పొందాయి. కార్యక్రమంలో సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియాఖాద్రీ, సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీ, దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ రజాక్ పీర్, చాపాడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల కోసం స్థాపించిన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు లభించిందని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాషా ఫక్రుద్దీన్ తెలిపారు. తక్కువ సమయంలో 52 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కార్మిక కుటుంబాలు రుణపడి ఉంటాయన్నారు.

గుర్తింపు కోసం కృషి చేసిన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రయ్య,రాష్ట్ర కార్యదర్శి డీఎస్‌పీ రావులకు కార్మికుల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

భక్తుల మనోభావాలను గౌరవించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పాలకులు భక్తుల మనోభావాలను గుర్తించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ తెలిపారు. బుధవారం కడపలోని మాసాపేట ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాన్ని అక్రమంగా కూల్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ కట్టాలని భావించడం తగదన్నారు. ఈ విషయంగా భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, కల్యాణ్, జోనల్ ఇన్‌చార్జి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కడప పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ బాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు ఆందోళనలు

కడప సెవెన్‌రోడ్స్ : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే దశల వారీ ఆందోళనలు చేపడతామని ప్రభుత్వ ఉద్యోగులు తెలిపారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణప్రసాద్, నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ప్రతినెల 1వ తేదీ జీతభత్యాలు చెల్లించేలా చట్టం తీసుకు రావాలన్నారు. 1993 నవంబరు 25వ తేదికి ముందు నియమితులైన ఎన్ఎంఆర్, డైలీ వేజెస్, కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. 11వ పీఆర్సీ అమలులో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో భాగంగా ఆర్థికపరమైన బకాయిలను, డీఏ, అరియర్స్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. 12వ వేతన సవరణ సంఘం నియమించకుండానే ఉద్యోగ సంఘాలతో నేరుగా సంప్రదింపులు జరిపి వేతన సవరణ చేపట్టాలన్నారు.

పొగాకు మానేసి ఆరోగ్యాన్ని కాపాడుకోండి



పులివెందులలో పొగాకు నివారణ ర్యాలీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

పులివెందుల టౌన్ : పొగాకు మానేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ తెలిపారు. బుధవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సిబ్బంది, నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృతహస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక వైద్యశాల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నిర్వహించిన ర్యాలీని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ప్రదీప్‌లు ప్రారంభించి మాట్లాడారు. ధూమపానం, మద్యపానం సేవించడం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని.. దీనివల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. గుట్కా, తంబాకు నమలడం ద్వారా వచ్చే నోటి క్యాన్సర్ చాలా ప్రమాదకరమన్నారు. కార్యక్రమంలో రక్తనిధి మెడికలాఫీసర్ డాక్టర్ శుభశ్రీ, డాక్టర్లు మైనుద్దీన్, ముక్తియార్, డీపీఎం సుబ్బారెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సతీష్, పొగాకు కౌన్సిలర్ సుమలత, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య, ఎస్‌టీడీ కౌన్సిలర్ బాదల్‌వల్లి, సేవా సమితి అధ్యక్షుడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

చక్రాయపేట : వేంపల్లె-మదనపల్లెకు తిరిగే బస్సు సర్వీసును పునరుద్ధరించాలని మండల వాసులు కోరుతున్నారు. మదనపల్లె డిపోకు చెందిన బస్సు అంగళ్లు, ముదివీడు, కోటకొండ, పెద్దమండ్యం, గాలివీడు, నూలివీడు, గొట్లమిట్ట, చక్రాయపేట, గండి మీదుగా వేంపల్లెకు 4 సింగల్లు తిరిగేది. సుమారు యేడాది కాలం తిరిగిన బస్సు సర్వీసును ఇటీవల అధికారులు రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు కారణం పులివెందుల డిపో బస్సును వేంపల్లె నుంచి గాలివీడు వరకు నడపుతున్నారు. ఈ బస్సు మదనపల్లె బస్సుకు అరగంట ముందు వెళుతుండటంతో బస్సు కలెక్షన్లు దెబ్బతిన్నందున రద్దు చేశారని ప్రజలు అంటున్నారు. పులివెందుల బస్సును మదనపల్లె వరకు నడిపితే రెండు బస్సుల మధ్య సుమారు రెండు మూడు గంటల వ్యవధి ఉంటుందని ఫలితంగా కలెక్షన్లు పెరగడమే కాకుండా ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయంటున్నారు. అధికారులు స్పందించి మదనపల్లె బస్సును పునరుద్ధరించడమే కాకుండా పులివెందుల బస్సును రోజుకు 4 సింగల్లు మదనపల్లె వరకు నడపాలని చక్రాయపేట, గాలివీడు మండల వాసులు కోరుతున్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని గంగనపల్లె గ్రామంలో వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం ఆలయ ఈఓ మహేశ్వర్‌రెడ్డి, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. బండలాగుడు పోటీలను పాలతల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డిలు ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ అజెండాలోని అంశాలను కౌన్సిల్ సమావేశంలో ఆమోదం కోరకు ఉంచారు. కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు మహమ్మద్‌అలీ, ఎరికలరెడ్డి, భాస్కర్‌లు వారి వార్డులలో ఉన్న పలు సమస్యలపై కౌన్సిల్‌లో కమిషనర్‌కు విన్నవించారు. తర్వాత అజెండాలోని పలు అంశాలపై వారు అభ్యంతరం తెలిపారు. వాటికి కమిషనర్ వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్‌లు జైబున్నీసా, చంద్రకళ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థుల చిత్రలేఖన పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, తదితరులు

పులివెందుల టౌన్ : గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన భాండాగారాలు అని మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు తెలిపారు. బుధవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు కథలు చదడం, పద్యాలు చెప్పడం, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కృష్ణకిశోర్‌రెడ్డి, కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవరచుకోవాలి

కమలాపురం : ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారి వాగాంజలి తెలిపారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. అలాగే విద్యతో పాటు క్రీడలు, డ్రాయింగ్ తదితర పోటీల్లో పాల్గొని రాణించాలన్నారు. ధ్యానం, యోగ చేస్తే విద్యలో ఏకాగ్రత సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు.

దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న మోదీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రగతిపథంలో పయనిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన తీరుతో స్టార్టప్ కంపెనీలు దాదాపు 90 వేలకు పైగా వచ్చాయన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మరోమారు బ్రహ్మరథం పట్టనున్నారని తెలిపారు. మద్యం అమ్మకాలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ తనదైన శైలిలో విచారణ జరుపుతుందే తప్ప అందులో విమర్శలకు తావు లేదన్నారు. ఇప్పటికే ఈ కేసులో అనేక మందిని అరెస్టుచేశారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డి, కడప పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలకృష్ణయాదవ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మినారాయణరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బత్తల పవన్‌కుమార్, అమర్నాథరెడ్డి, కల్యాణ్, లక్ష్మణరావు, శివ, కృష్ణ, కాలివాహన్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఏఎఫ్‌యూ స్థలంలో సర్వే

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వ విద్యాలయానికి కేటాయించిన 110 ఎకరాల్లో బుధవారం రెవెన్యూ అధికారులు సర్వేచేశారు. యోగివేమన విశ్వ విద్యాలయానికి సమీపంలో కేటాయించిన స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా పెండ్లిమర్రి రెవెన్యూ అధికారులు స్థలాన్ని సర్వే చేసి హద్దులను చూపించడంతో విశ్వవిద్యాలయ సిబ్బంది జెండాలను పాతారు.

అభివృద్ధి సాధించడంలో ఘనత మాదే..

-వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎర్రగుంట్ల :నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అభివృద్ధిని సాధించడంలో ఘనత మాదే అని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డిలు అన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో ఎర్రగుంట్ల మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుంటే మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి హయాంలో కనీసం ఎర్రగుంట్లలో మున్సిపల్ భవనం కూడా కట్టలేదని ఇది భూపేష్ గుర్తుంచుకోవాలన్నారు. మా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హయాంలో మున్సిపల్ భవనం, నాల్గులైన్ల జాతీయ రహదారి, డ్రైనేజీలు, నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన ఓ బిక్షగాడైన భూపేష్ మా ఎమ్మెల్యే గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జమ్మలమడుగులో చికెన్ దుకాణాల నుంచి మా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డబ్బులు వసూళ్లు చేశారని ఆరోపించిన భూపేష్ అది నిరుపించకపోతే నీవు ఎన్నికల నుంచి తప్పుకుంటావా అని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి సవాల్ విసిరారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జెక్కు చెన్నకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు రామలింగారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మహమ్మద్ రఫీ, పెద్దరెడ్డిలు పాల్గొన్నారు.

నాపరాయి రాయల్టీని పూర్తిగా తగ్గించిన ఘనత మాదే

ఎర్రగుంట్ల నాపరాయి పరిశ్రమకు రాయల్టీ కష్టాల నుంచి ఉపశమనం ఇచ్చి పూర్తిగా రాయల్టీని లేకుండా చేసిన ఘనత మా ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డికే దక్కుతుందని ఆ ఘనతను టీడీపీ నేతలు లోకేష్, భూపేష్‌లు వేసుకోవడం ఏమిటని నాపరాయి పరిశ్రమ యజమాని, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ జెక్కు చెన్నకృష్ణారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం ఆయన ఎర్రగుంట్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా నాపరాయి పరిశ్రమ అసోసియేషన్ తరుపున మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చి 2019 నుంచి ఇప్పటి వరకూ రాయల్టీ పెంచలేదన్నారు. అయితే కన్సలేటేషన్ ఫీజుపై మాత్రం పెంచడం జరిగిందన్నారు. అయితే ఎర్రగుంట్ల స్వంత మండలం కావడంతో మా ఎమ్మెల్యే ప్రత్యేక కృషి చేసి నాలుగుసార్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు, ఎంపీ మంత్రుల వద్ద పలు సార్లు మమ్మల్ని పిలుచుకునిపోయి రాయల్టీ తగ్గింపుపై చర్చించి కన్సల్టేషన్ ఫీజును తగ్గించారన్నారు. ఈ ఘనతను లోకేష్ పాదయాత్ర వస్తుంటే రాయల్టీ తగ్గించారని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు.